# రైతులకు ఏదీ 'భరోసా'?

తాము అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ పథకం కింద యేదాదికి ప్రతి రైతుకు రూ.20 వేలు అందిస్తామని ఆర్భాటంగా ప్రకటించారు. అధికారం చేపట్టి ఐదు నెలలవుతున్నా ఆ ఊసే ఎత్తడం లేదు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ పూర్తి అయ్యింది. ప్రస్తుతం రబీ సీజన్ ప్రారంభమై నెల రోజులవుతున్నా రైతులకు సాయం అందడం లేదు. ఉత్తుత్తి హామీలతో చంద్రబాబు తమను మరోసారి మోసం చేశాడని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. – ఆత్మకూరు

- ఖరీఫ్ ముగిసి రబీ ప్రారంభమైనా అమలు కాని అన్నదాత సుఖీభవ పథకం
- ఆందోళనలో రైతులు



రైతులు రబీ సీజన్ కింద సాగుచేసిన వేరుశనగ, కంది పంటలు

ఈ యేడాది ఖరీఫ్ సీజన్‌లో ఆత్మకూరు డివిజన్‌లో అధిక వర్షాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. మొక్కజొన్న, వరి, కంది, మినుము పంటలు వర్షార్పణమయ్యాయి. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో రైతు భరోసా పేరుతో రైతులను ఆదుకునేది. ఏటా మే నెలలో రూ.7,500 పెట్టబడి సాయాన్ని అందించేది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.5,500, కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు కలిపి ఆ మొత్తాన్ని రైతులకు బ్యాంకుల్లో జమ చేసేవారు. దీంతో రైతులు ఎరువులు, విత్తనాలను కొనుగోలు చేసుకుని ఖరీఫ్‌కు సిద్ధమయ్యేవారు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులను గాలికొదిలేసింది. ×అన్నదాత సుఖీభవ పథకం☆ కింద యేదాదికి రూ.20 వేలు ఇస్తామని చెప్పి నేటికీ రూపాయి కూడా అందించకపోవడమే అందుకు నిదర్శనం.

**గత ప్రభుత్వంలో మూడు విడతలుగా సాయం**

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు యేదాదికి రూ.13 వేలను మూడు విడతలుగా అందించేది. మే నెలలో రూ.7500, అక్టోబర్ నెలలో రూ.4 వేలు, జనవరి నెలలో రూ.2 వేల చొప్పున రైతులకు అందించి ఖరీఫ్, రబీ సీజన్లలో అండగా నిలిచేంది. రైతులు ఈ సొమ్ముతో కూలీలు, ఎరువులు, విత్తనాలకు ఆ డబ్బులను రైతులు ఉపయోగించుకునేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రైతులకు ఖరీఫ్ సీజన్ ముగిసినప్పటికీ రూపాయి కూడా అందకపోవడం, రబీ సీజన్ ప్రారంభమై నెల గడిచినా పట్టించుకోకపోవడంపై ప్రభుత్వంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**రైతులకు తప్పని తిప్పలు**

రైతులకు ఈ యేడాది ఖరీఫ్ సీజన్ కడగండ్లను మిగిల్చింది. రబీ సీజన్‌కు సిద్ధమైన రైతులకు ఎరువులు, విత్తనాలను కొనుగోలు చేసేందుకు పెట్టుబడులు లేక రైతులు ఇబ్బందులు పడేవారు. రైతన్నలు దొరికిన చోట అప్పులు చేసి పంటలను సాగు చేస్తున్నారు. రైతులు మినుము, కంది, వేరుశనగ పంటలను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ పంటలకు పెట్టుబడి లేకపోవడంతో రైతులకు ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.30 వేలకు పైగా పెట్టుబడి పెడుతున్నారు.

| గత ప్రభుత్వంలో రైతులకు అందిన సాయం | | |
|---|---|---|
| మండలం | లబ్ధి పొందిన రైతులు | నగదు(రూ.) |
| ఆత్మకూరు | 7,401 | 4.10 కోట్లు |
| బండిఆత్మకూరు | 8,331 | 4.59 కోట్లు |
| మహానంది | 4,245 | 2.33 కోట్లు |
| వెలుగోడు | 5,770 | 3.17 కోట్లు |

దీంతో రైతులు అప్పులు తీసుకుని పంటలను సాగు చేస్తున్నారు. ఆత్మకూరు వ్యవసాయ డివిజన్ పరిధిలో దాదాపు 7 వేల హెక్టార్లకు పైగా మినుము పంటను సాగుచేయగా, 2 వేల హెక్టార్లకు పైగా కంది, 500 హెక్టార్లలో వేరుశనగ పంటను రైతులు సాగు చేశారు. రబీ సీజన్ కూడా గడువు ముగియడంతో రైతులకు ఇప్పటికి కూడా కూటమి ప్రభుత్వం సాయం అందించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

**పెట్టుబడులకు అప్పు చేశాం**



గత ప్రభుత్వంలో అక్టోబర్ నెలలోనే రూ.4 వేలు సాయం అందేది. ఖరీఫ్‌లో రూ.7,500 చొప్పున ఇచ్చేవారు. సంక్రాంతి కానుకగా మరో రూ.2 వేలు ఇచ్చేవారు. ఆ డబ్బు ఎంతగానో ఉపయోగపడేది. ఈ ప్రస్తుతం రూపాయిని కూడా ఇవ్వలేదు. పెట్టుబడులకు అప్పులు చేశాం.
– నబీసాహెబ్, ఆత్మకూరు రైతు

**నమ్మి ఓట్లేశాం**



అన్నదాత సుఖీభం పథకం కింద ఏడాదికి రూ.20 వేలు ఇస్తామన్నందుకు నమ్మి ఓట్లేశాం. అధికారం చేపట్టిన తర్వాత దానిపై ఎవరూ మాట్లాడటం లేదు. గతంలో నేరుగా బ్యాంకు ఖాతాలో డబ్బు జమ అయ్యేది. ప్రస్తుతం పెట్టుబడులకు కష్టంగా ఉంది. – విజయ్, ఆత్మకూరు రైతు

**హామీ నెరవేర్చాలి**



కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు సాయం అందించాలి. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ నెరవేర్చాలంటే కచ్చితంగా రూ.20 వేలు అందివ్వాలి. లేకపోతే చంద్రబాబును ఇకపై ఎప్పటికీ నమ్మం.
– నజీముద్దీన్, ఆత్మకూరు రైతు

## క్లుప్తంగా

### క్రాస్ రెగ్యులేటరు నుంచి 10వేల క్యూసెక్కుల నీటి విడుదల



బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరు గేట్ల నుంచి విడుదలువుతున్న నీరు

**పాములపాడు:** మండలంలోని బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరు నుంచి 10వేల క్యూసెక్కుల నీటి విడుదల చేసినట్లు ఏఈ దేవేంద్ర తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరు నుంచి 10వేలు క్యూసెక్కులు ఎస్ఆర్ఎంసీ ద్వారా బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరుకు వచ్చి చేరుతుందని చెప్పారు. తెలుగుగంగ (వీబీఆర్)కు 3వేల క్యూసెక్కులు, జీఎన్ఎస్ఎస్‌కు 4వేల క్యూసెక్కులు, కేసీసీ ఎస్కేప్ చానల్‌కు 3వేల క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో 16.5 టీఎంసీల నీరు ఉన్నట్లు వివరించారు.

### అధికారులు సమయపాలన పాటించాలి

- ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి



మాట్లాడుతున్న ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి

**బండిఆత్మకూరు:** అధికారులు సమయపాలన పాటించాలని ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహిచారు. ముందుగా అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. సబ్సిడీ సోలార్ విద్యుత్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ ధోనిఅల్ ఫ్రెడ్, ఎంపీడీఓ ఎం.దస్తగిరి, వైస్ ఎంపీపీలు రాగాల రమణ, ముంతల మధురాణి తదితరులు పాల్గొన్నారు.

### పూజా సామగ్రి అందజేత



80బన్నూరులో ఆలయానికి పూజా సామగ్రి అందజేస్తున్న దృశ్యం

**జూపాడుబంగ్లా:** కార్తీక మాసాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని 80బన్నూరు, పోతులపాడు,చాబోలు, తాటిపాడు, జూపాడుబంగ్లా, రామసముద్రం, కొత్త సిద్దేశ్వరం, పారుమంచాల, తదితర గ్రామాల్లోని 30 దేవాలయాలకు రూ.20వేల విలువైన పూజా సామగ్రి కిట్లను దానధర్మ ట్రస్టు సభ్యులు రత్నాలసూర్య, వలంటీర్ బండ్ల రవికుమార్ అందజేశారు. కార్యక్రమంలో నాగశేషులు పాల్గొన్నారు.

### ఏఈఓకు అదనపు బాధ్యతలు

**శ్రీశైలంటెంపుల్:** శ్రీశైల దేవస్థాన సహాయ కార్యనిర్వహణాధికారి జి.స్వాములుకు ప్రస్తుతం నిర్వహిస్తున్న విధులతోపాటు దేవస్థాన చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ దేవస్థాన ఇన్‌చార్జ్ ఈఓ ఐ.చంద్రశేఖరరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం దేవస్థాన పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా ప్రస్తుతం సీఎస్ఓగా విధులు నిర్వహిస్తున్న అయ్యన్నను రిలీవ్ చేస్తూ ఆ బాధ్యతలను ఏఈఓ స్వాములుకు అప్పగించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**మహానంది:** గాజులపల్లె, తిమ్మాపురం, బుక్కాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 33కేవీ లైన్ పనులు, సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపేస్తామని, వినియోగదారులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

### ప్రసవ వేదనతో గోమాత మృతి

**శ్రీశైలంప్రాజెక్ట్:** గోవులకు మేత పెట్టని యజమానులు వాటిని సున్నిపెంటలో రోడ్లపైకి వదిలేస్తున్నారు. అవి చెత్తాచెదారం, పడేసిన మాంసాహార, ప్లాస్టిక్ వ్యర్థాలు తిని మృత్యువాత పడుతున్నాయి. శుక్రవారం ఉదయం చెంచుగిరిజనుల పాలం వద్ద ఓ గోవు ప్రసవవేదనతో మృతి చెందింది. ప్రమాదవశాత్తూ మృతిచెందిన గోవుల కోసం నష్టపరిహారం వస్తుందనే ఆశతో తమదంటే తమది అంటూ వచ్చే యజమానులు.. ప్రసవ వేదనతో మృతిచెందిన గోవు తమది కాదంటే తమది కాదనడం గమనార్హం. కళేబరాన్ని తీసుకెళ్లేందుకు, అంతిమ సంస్కారం జరిపేందుకు ఖర్చు పెట్టాల్సి వస్తుందని ఎవరూ ముందుకు రావడం లేదని సమాచారం.

### నేడు వెలుగోడుకు శిల్పా రాక

**వెలుగోడు:** మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి శనివారం వెలుగోడుకు రానున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి తెలిపారు. పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని, నాయకులు కార్యకర్తలు ఏమైనా సమస్యలు ఉంటే ఆయన దృష్టికి తీసుకురావాలని ప్రభాకర్‌రెడ్డి సూచించారు.

### ఆలయాభివృద్ధికి సలహాలివ్వండి



**మహానంది:** ఆలయ అభివృద్ధికి భక్తులు సలహాలు ఇవ్వాలని ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ విరాళాల కేంద్రం వద్ద సలహాలు, సూచనల బాక్సును ఏర్పాటు చేశామన్నారు. స్వామి దర్శనానికి వచ్చిన భక్తులు ఏవైనా ఇబ్బందులు ఎదుర్కొని ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

### కార్తీక దీపోత్సవం



**మహానంది:** గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలో గంగ, గౌరీ సమేత మరకతలింగేశ్వర స్వామి ఆలయాల వద్ద శుక్రవారం రాత్రి కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు కనమర్లపూడి మస్తాన్‌రావు ఆధ్వర్యంలో అర్చకులు, పండితులు స్వామి, అమ్మవార్లకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. నక్షత్ర వనం వద్ద దీపాలను శివలింగాకారంలో పేర్చి దీపపూజ నిర్వహించారు.

## బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్

**ఆత్మకూరు:** బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంకు ఆత్మకూరు బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. మండలంలోని కురుకుంద గ్రామంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆర్థిక అక్షరాస్యత కేంద్రం వారి ఆధ్వర్యంలో జన సురక్ష స్యాచురేషన్ క్యాంపును శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 నుంచి 50 ఏళ్లలోపు ఉన్న ప్రతిఒక్కరూ ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాల ద్వారా ఇన్సూరెన్స్ చేయించుకుంటే ఆపద సమయాల్లో ఎంతో ఆసరగా ఉంటాయన్నారు. సమావేశంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్లు శంకరయ్య, విజయరాజు, వీఓఏ తిమ్మదాసు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా పల్లకోత్సవం



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

**మహానంది:** మహానందీశ్వర స్వామి దంపతుల పల్లకోత్సవం వైభవంగా జరిగింది. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, ఆంజనేయశర్మ, హనుమంతుశర్మలు స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ఆలయ ప్రాకారాల్లో పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. కాగా కార్తీకమాసంతోపాటు పెళ్లిళ్లు అధిక సంఖ్యలో జరగడంతో మహానంది ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

- గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి దంపతులకు కార్తీకమాసం, శుక్రవారం పురస్కరించుకుని యాగశాలలో ఉదయం నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు.

## వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



**గోస్పాడు:** మండలంలోని జిల్లెల్ల గ్రామంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. గతంలో ఏర్పాటు చేసిన ధ్వజస్తంభం దెబ్బతినడంతో గ్రామానికి చెందిన గొటికె చిన్న బాలిరెడ్డి కుమారులు జ్యోతిరెడ్డి, ఈశ్వరరెడ్డి సహకారంతో కొత్త ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో మూడు రోజుల పాటు వేదపండితుడు గుండంపాటి నరసింహశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యంత్రప్రతిష్ఠ, ధ్వజప్రతిష్ఠ, బలిహరణం, పూర్ణాహుతి వంటివి నిర్వహించి ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేశారు. ప్రజలు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### సెపక్‌తక్రా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

**దొర్నిపాడు:** స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన బాలికలు సెపక్‌తక్రా క్రీడలో జిల్లా స్థాయిలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఇటీవల కర్నూలులోని డీఎస్ఏ స్టేడియంలో జరిగిన పోటీల్లో కావ్యశ్రీ, స్టాండ్‌బైగా అజిజాబీ అండర్–17 విభాగంలో సెపక్‌తక్రాలో ప్రతిభ చూపినట్లు చెప్పారు. వీరు ఈనెల 9, 10 తేదీల్లో సి.బెళగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అనంతరం ఫిజికల్ డైరెక్టర్ దేవేంద్రను హెచ్ఎం అభినందించారు.

## పంటల బీమా చేయించుకుంటేనే నష్టపరిహారం వర్తింపు

**జూపాడుబంగ్లా:** రబీ సీజన్‌లో సాగుచేసిన పంటలకు నిర్ణీత ప్రీమియం చెల్లించి క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకుంటేనే పంట నష్టపరిహారం వర్తిస్తుందని మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వరి పంటకు హెక్టారుకు రూ.315, ఎకరాకు రూ.126, జొన్న పంటకు హెక్టారుకు రూ.148.50, ఎకరాకు రూ.59, మినుము పంట హెక్టారుకు రూ.118.75, ఎకరాకు రూ.48, వేరుశనగ హెక్టారుకు రూ.160, ఎకరాకు రూ.64, ఉల్లి పంట హెక్టారుకు రూ.225, ఎకరాకు రూ.90, పప్పుశనగ పంట హెక్టారుకు రూ.210, ఎకరాకు రూ.84 చొప్పున మీసేవ, రైతుసేవ కేంద్రాల్లో ప్రీమియం చెల్లించి పంటల బీమా చేయించుకోవాలని చెప్పారు. పంటలబీమా చేయించుకొన్న రైతులు తప్పనిసరిగా ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు. ప్రీమియం చెల్లించి, ఈ–క్రాప్‌బుకింగ్ చేయించుకున్న పంటలు ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం వాటిల్లితే పరిహారం మంజూరవుతుందన్నారు. పప్పుశనగ పంట నష్ట పరిహారం చెల్లించే సమయంలో గ్రామ యూనిట్‌గా తీసుకొంటారని తెలిపారు. మినుము, జొన్న, వరి పంటలకు మండలాన్ని యూనిట్‌గా తీసుకొంటారని, వేరుశనగ, ఉల్లి పంటలకు జిల్లా యూనిట్‌గా తీసుకొని పంటనష్టాన్ని అంచనా వేసి పరిహారం చెల్లిస్తారని వివరించారు. వేరుశనగ, పప్పుశనగ, ఉల్లి, జొన్న, మినుము పంటలు సాగుచేసిన రైతులు డిసెంబర్ 15వ తేదీలోపు, వరి పంట సాగుచేసిన రైతులు డిసెంబర్ 30వ తేదీలోగా ప్రీమియం చెల్లించాలని సూచించారు.

## శ్మశాన స్థలాన్ని కాపాడండి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

**నందికొట్కూరు:** కృష్ణారావుపేట గ్రామంలో దూదేకుల శ్మశాన స్థలాన్ని కాపాడాలని సీపీఐ జిల్లా నాయకుడు రమేష్‌బాబు కోరారు. శుక్రవారం మండలంలోని అల్లూరు గ్రామంలో టీడీపీ జిల్లా నాయకుడు మాండ్ర శివానందరెడ్డి స్వగృహంలో ఎమ్మెల్యే జయసూర్యకు దూదేకుల కులస్తులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ శ్మశానానికి 50 సెంట్ల స్థలం ఉంటే ఒక వైపు నేషనల్ హైవే పనులు, మరో వైపు అధికారులు సాగునీటి కాలువలు తీస్తుండటంతో స్థలం కుంచించుకుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అతితక్కువ స్థలంలో అంత్యక్రియలు ఎలా చేసుకోవాలో అధికారులు తేల్చాలన్నారు. ప్రత్యామ్నాయం చూపకుండా స్థలాన్ని ఆక్రమించడం సరికాదన్నారు. సుమారు 500 కుటుంబాలు దూదేకుల కులానికి చెందిన వారు ఉన్నారని చెప్పా. ఎమ్మార్పీఎస్ నాయకులు స్వాములు, సీపీఐ నాయకులు పుల్లయ్య, దూదేకుల సంఘం నాయకులు సైపుద్దీన్, మూర్తుజావలి, బాషా పాల్గొన్నారు.

### బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి

**మిడుతూరు:** బ్యాంకు అకౌంట్‌కు ఆధార్ అనుసంధానం చేసుకోని వారు తప్పనిసరిగా అనుసంధానం చేసుకోవాలని ఎంపీడీఓ దశరథరామయ్య సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో వివిధ గ్రామాల్లో బ్యాంకు అకౌంట్‌కు ఆధార్ అనుసంధానం చేసుకోవలసిన వారు 3,380 మంది ఉన్నారన్నారు. ఆధార్ అనుసంధానం చేసుకోని పక్షంలో భవిష్యత్‌లో ప్రభుత్వ ఇచ్చే రాయితీలు మీ అకౌంట్‌కు జమకావని తెలిపారు. ఈ నెల 10వ తేదీ లోపు బ్యాంకు అకౌంట్‌ను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని చెప్పారు.

### దేవస్థాన సీఎస్ఓపై ఫిర్యాదు

**శ్రీశైలంటెంపుల్:** శ్రీశైల దేవస్థానంలో చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న పర్యవేక్షకులు అయ్యన్నపై సున్నిపెంట గ్రామానికి చెందిన వారా కడిమి అనే వ్యక్తి దేవస్థాన ఈఓకు లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. ఈనెల 1న గణేశ సదనం పార్కులో మిత్ర బృందంతో కలిసి టపాసులు కాల్చి, పుట్టినరోజును పురస్కరించుకుని కేక్ కటింగ్ చేశామని, దేవస్థాన నిబంధనలకు విరుద్ధంగా టపాసులు పేల్చడం, కేక్ కటింగ్ చేయకూడదని తనను సీఎస్ఓ భయభ్రాంతులకు గురి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

### తెరుచుకున్న మద్యం దుకాణం

**శ్రీశైలంప్రాజెక్ట్:** సున్నిపెంట గ్రామంలో ఎట్టకేలకు మద్యం దుకాణం తెరుకుంది. తెలంగాణాకు చెందిన వారికి సున్నిపెంటలోని రెండు మద్యం దుకాణాలు డిప్‌లో వచ్చాయి. అధికార పార్టీ నేతల సిండికేట్ ఒత్తిళ్లతో ఆలస్యంగా దుకాణాలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే ఒక దుకాణం ఓపెన్ కాగా రెండో దుకాణం లైసెన్స్‌దారుడిని తమ దారికి తెచ్చుకున్న అధికార పార్టీ నేతలు పచ్చజెండా ఊపడంతో శుక్రవారం దుకాణం తెరిచారు.

### ధోబీఘాట్ స్థలాన్ని కాపాడాలి

**ఆత్మకూరు:** ధోబీ ఘాట్ స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ చందావారి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షులు శీలం రామకృష్ణ, నాయకులు శివుడు, వెంకటస్వామి(బంగారు), శివ నాగార్జున, బాలుడు శుక్రవారం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ధోబీఘాట్‌పై 100 రజక కుటుంబాలు ఆధారపడ్డాయని, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని వివరించారు. వెంటనే తహసీల్దార్‌కు ఎమ్మెల్యే ఫోన్ చేసి ధోబీఘాట్ ఆక్రమణలకు గురికాకుండా చూడాలని ఆదేశించారు.

### 11నుంచి ప్రత్యేక ఆధార్ కేంద్రం

**పాములపాడు:** ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్‌సేవలు అందించనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక జూనియర్ కళాశాలలో ప్రత్యేక ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆధార్ కార్డుల్లో మార్పులు చేయించుకోవాలని సూచించారు. కేవలం

### ఓటరు నమోదుకు ప్రత్యేక శిబిరం

**నందికొట్కూరు:** ఓటరు నమోదుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శని, ఆదివారాల్లో ఓటరు నమోదు కార్యక్రమం చేపడతామని చెప్పారు. ఈ నెల 9, 10, 23, 24 తేదీల్లో స్పెషల్ కాంపెయిన్ పోలింగ్ బూతుల వద్ద బూత్‌స్థాయి అధికారులు నిర్వహించాలని ఆదేశించామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్ఓలు అందుబాటులో ఉంటరాన్నారు. అవకాశన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోండి**

**పాములపాడు:** అర్హులైన యువతీ, యువకులు ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ సుభద్రమ్మ తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 9,10,23,24 తేదీల్లో అన్ని గ్రామాల్లోని పోలింగ్ బూత్‌ల వద్ద ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించాలని ఎన్నికల సంఘం ఆదేశించిందన్నా రు. 2025 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఫారం 6 పూరించాలని చెప్పారు. అలాగే ఓటు తొలగింపునకు ఫారం 7, సవరణ కోసం ఫారం 8 పూర్తి చేసి అందజేయాలన్నారు.

## సీఎం పర్యటన బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన



భద్రత ఏర్పాట్లపై సూచనలిస్తున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా

**శ్రీశైలం:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీ–ప్లేన్‌లో శ్రీశైలం రానున్న సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా తెలిపారు. శుక్రవారం ఆయన భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. పాతాళగంగలో సీ–ప్లేన్ ల్యాండ్ అయ్యే ప్రదేశం, రోప్ వే, పాతాళగంగ బోటింగ్ ప్రదేశాలను ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్‌తో కలిసి ఆయన పర్యటించారు. పది స్పెషల్ పార్టీ, నాలుగు గ్రేహౌండ్స్ బృందాలతోపాటు 523 మంది పోలీసు అధికారులతో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ తెలిపారు.

### ఓటరు నమోదు

**బండిఆత్మకూరు:** మండల పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ నమోదు కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ ధోని అల్ ఫ్రెడ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అన్ని పోలింగ్ స్టేషన్లలో 9, 10, 23, 24 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పెషల్ క్యాంపెయిన్ ఉంటుందన్నారు. కొత్తగా ఓటర్ నమోదుకు ఫారం–6, అభ్యంతరాలున్నచో ఫారం –7 ఓటర్ కార్డులో మార్పుచేర్పులకు ఫారం– 8 ద్వారా పరిష్కరించుకోవాలన్నారు.

### ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**బండిఆత్మకూరు:** స్థానిక గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో ఈనెల 11, 12, 13 తేదీలలో ఏర్పాటు చేయనున్న ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ దస్తగిరి సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఒరిజినల్ ఓటర్ కార్డు/బ్యాంకు పాస్ బుక్/డ్రైవింగ్ లైసెన్స్ తీసుకొచ్చి, రూ.50 రుసుముతో ఆధార్ కార్డును అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు.

## 14న జిల్లా స్థాయి సబ్ జూనియర్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

**నంద్యాల(న్యూటౌన్):** పట్టణంలోని రామకృష్ణ పీజీ కళాశాల క్రీడా మైదానంలో జిల్లా స్థాయి జూనియర్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఈనెల 14వ తేదీన నిర్వహిస్తున్నట్లు క్రీడాభారతి అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రామకృష్ణారెడ్డి, శాంతినికేతన్ పాఠశాల చైర్మన్ సుధాకర్ తెలిపారు. శుక్రవారం స్థానిక పీజీ కళాశాలలో టోర్నమెంట్ కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బాలబాలికలు వేర్వేరుగా ఈ పోటీల్లో పాల్గొనాలన్నారు. ఆధార్‌కార్డుతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. మరింత సమాచారం కోసం సెల్ : 97008 02189 నంబరును సంప్రదించాలన్నారు. అండర్–13, 15 విభాగాల్లో పాల్గొని చక్కని ప్రతిభ కనబరచాలని క్రీడాకారులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో క్రీడా భారతి ట్రెజరర్ రమేష్, జాయింట్ సెక్రటరీ రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గుంతలు పూడ్చండి సారూ!



రోడ్డుపై పడిన గుంతలు

**కొత్తపల్లి:** మండల కేంద్రం నుంచి ఆత్మకూరుకు వెళ్లే రహదారిపై బావాపురం గ్రామంలో ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా మారాయని వెంటనే పూడ్చాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు శుక్రవారం గ్రామస్తులు తిరుపాల రెడ్డి, రమణారెడ్డి, రంగారెడ్డి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఈ దారిలో రోడ్డు గుంతలు పడ్డాయని, వాటిలో మురుగు, వర్షపునీరు నిలిచిపోవడంతో గుంతల లోతు తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని చెప్పారు. సమస్యను అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారని, ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.